కె. బాలగోపాల్

# లాల్‌గఢ్: ఎవరి బాధ్యత ఎంత?

లాల్‌గఢ్ ఉదంతం ఏ అర్థంలోనూ ముగింపుకు రాలేదు. పరిపాలనా వ్యవస్థను అక్కడ తిరిగి స్థాపించే పోలీసుచర్య ముగింపుకు రాబోతున్నదనీ చివరి దశ మొదలయిందనీ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వము, పారా మిలిటరీ దళాల అధికారులు అనగా వింటున్నాం. ఇప్పటి వరకు ఈ పోలీసు చర్యలో రక్తపాతం భయపడినంతగా జరగలేదుగానీ 'చివరిదశ'లో ఎటువంటి వార్తలు వినవలసివస్తుందోనన్న ఆందోళన లేకపోలేదు. అయితే కొత్తగా ఠాణా అప్పగించబడ్డ ఎస్ఐలాగ ఉత్సాహపడుతున్న హోం మంత్రి చిదంబరం గాని, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం గాని కోరుకున్న ఈ ముగింపు లభించినా కూడ అది వేరే ఏ అర్థంలోనూ లాల్‌గఢ్‌కు ముగింపు కాదు. ఆ రాష్ట్ర పాలకులు, ప్రత్యేకించి సిపిఎం నాయకులు ఇప్పటికైనా గ్రహించవలసిన సత్యాలు కొన్ని ఉన్నాయి. ఇవి నందిగ్రాం సమయంలోనే వెలికివచ్చాయిగానీ ఇప్పుడు మరింత స్పష్టం అయినాయి. ముప్పై ఏళ్ళకు పైగా వామపక్ష పార్టీలు ఆ రాష్ట్రాన్ని అవిచ్ఛిన్నంగా పరిపాలించిన క్రమంలో కొన్ని బలమైన అవలక్షణాలు పాలనా యంత్రాంగానికీ పాలక పార్టీలకూ అంటుకున్నాయి. ఆ రెండిటికీ తేడా చాలా వరకు చెరిగిపోవడం మొదటి అవలక్షణం. ఇది సిపిఎంకు ప్రత్యేకించి వర్తిస్తుంది. పాలక పార్టీయే ప్రభుత్వం, ప్రభుత్వమే పాలక పార్టీ అన్న స్థితి వచ్చింది. కోల్‌కతాలోనే కాదు, జిల్లాలలో సహితం సిపిఎం స్థానిక నాయకులు తాలూకా ఆఫీసు, పోలీస్‌స్టేషన్లతో మొదలుపెట్టి అన్ని కార్యాలయాలనూ శాసించడం రివాజు అయింది. ఈ ఫిర్యాదు కనీసం ఒక దశాబ్ద కాలంగా ఆ రాష్ట్రానికి ఎప్పుడు పోయినా వింటున్నాం. అయితే అది నందిగ్రాంతో ప్రజల నిరసన రూపంలో బయటికొచ్చింది. లాల్‌గఢ్‌లో దాని ఛాయలు బలంగా ఉన్నాయి. లాల్‌గఢ్‌లో గడచిన మూడు నాలుగు నెలల కాలంలో మావోయిస్టులూ వారి అండ వున్న ఉద్యమకారులూ సిపిఎం కార్యకర్తలను ఏరి ఏరి చంపిన ఘటనలు కేవలం రాజకీయ హత్యలు కావనీ వాటిలో పాలనా యంత్రాంగం పట్ల నిరసన కూడ ఇమిడి ఉందనీ గుర్తించడం అవసరం. అయినప్పటికీ అటువంటి హత్యలు అన్యాయమనీ, పైగా అవి నిరసనోద్యమాన్ని బలహీనపరుస్తాయే తప్ప దానికి బలం కల్పించవన్న విమర్శకు తావు వుంటుందన్నది వేరే విషయం.

తామే పాలనా యంత్రాంగమై వ్యవహరించే సిపిఎం కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వ విధానాల అమలును తమ కర్తవ్యంగా మీద వేసుకోవడం, వాటిని వ్యతిరేకించే వారి పైన భౌతిక దాడులకు పాల్పడడం తరచుగా జరుగుతుంటుంది. నందిగ్రాంలో సెజ్‌ను వ్యతిరేకించిన వారి పైన సిపిఎం కార్యకర్తలు భౌతిక దాడులు చేయడంతోనే సమస్య మొదలయింది. ఇది తప్పని సిపిఎం నాయకత్వం అంగీకరించక గత్యంతరం లేని పరిస్థితి ఇవాళ వచ్చింది. ఇంకనైనా ఆలస్యం చేయకుండ గ్రహిస్తారో లేదో చూడాలి. మూడు దశాబ్దాలుగా ఆ రాష్ట్రంలో అవిచ్ఛిన్నంగా గెలుస్తూ ఉండడానికి కారణాలేమిటన్న చర్చ ఎప్పుడొచ్చినా, కౌలురైతులకు (బర్గాదారులకు) భద్రత కల్పించారనీ, 73వ రాజ్యాంగ సవరణ కంటే ముందే పంచాయతులకు బలం కల్పించారనీ చెప్తుంటారు. ఇవి ఎప్పటి విషయాలో. ఆ తరువాత ఏం చేశారు? ఆ పైన ఏం చేశారు? లాల్‌గఢ్‌లో ఆదివాసులు తామే రోడ్లు వేసుకున్నారనీ చెరువులు తవ్వుకున్నారనీ వింటున్నాం. మూడు దశాబ్దాల వామపక్షాల పాలన తరువాత ఒక ఆదివాసీ ప్రాంతంలో వేయడానికి రోడ్లు, తవ్వడానికి చెరువులూ ఇంకా ఎందుకు మిగిలి ఉన్నాయి? ఆదివాసులకు పశ్చిమ బెంగాల్‌లో సిపిఎం నేతృత్వంలోని ప్రభుత్వం తగినంత చేయకపోవడం వల్లనే లాల్‌గఢ్‌లో అసంతృప్తి చెలరేగిందని సిపిఐ నాయకుడు బర్ధన్ మొన్న అన్నారు. ఆ రాష్ట్రంలో అధికారం పంచుకుంటూ బయటకు వచ్చి సిపిఎంను విమర్శించడంలోని నిజాయితీ ఎంత అని వారిని అడగవచ్చును గానీ, ఈ విమర్శ నిజమే కాదా? కనీసం ఆ రాష్ట్రంలోని ఆదివాసీ ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం చేత షెడ్యూల్డు ప్రాంతాలుగా ప్రకటింపచేయడానికి ప్రయత్నించిన దాఖలాలు కూడ లేవు (ఈ విమర్శ వామపక్ష పార్టీలు పదే పదే అధికారానికొస్తున్న కేరళకు కూడ వర్తిస్తుంది). ఆ గుర్తింపు ఉంటే కొన్ని హక్కులు స్వతహాగా వస్తాయి. కొన్ని కల్పించడం సులభం అవుతుంది.



కాగా, లాల్‌గఢ్ ఆదివాసీ పోరాటానికీ మావోయిస్టులకూ మధ్య నున్న సంబంధం ఇప్పటికీ స్పష్టంగా లేదు. ఎవరికి నచ్చిన చిత్రం వాళ్లు ఊహించుకుంటున్నారు. ఇతరులను అంగీకరించమంటున్నారు. ఆదివాసీ పోరాటం మొత్తం మావోయిస్టుల సృష్టి అనేది కేంద్ర 'ఇంటెలిజెన్స్' అని పిలవబడే వ్యవస్థ అభిప్రాయం. ఈ విషయం గ్రహించక పోవడం పశ్చిమ బెంగాల్ పాలకుల తెలివితక్కువతనం అని వారి విమర్శ. ఆ రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 17 ఏదో ఒక మేరకు మావోయిస్టుల ప్రభావంలో ఉన్నాయనీ, కేవలం తూర్పు, పశ్చిమ మెదినీపూర్‌లు (మిడ్నపూర్ అని అందరూ అంటున్న జిల్లాలు), పురూలియా, బంకూరాలకే వారి ప్రభావం పరిమితమయిందన్న సిపిఎం పాలకుల అభిప్రాయం హ్రస్వదృష్టి అనీ వారి నింద. మావోయిస్టులు కూడ తమ నాయకత్వంలోనే ఆ ఉద్యమం నడుస్తున్నదన్న అభిప్రాయం బహిరంగంగా కలిగిస్తున్నారు (అది నిజమైనా కూడ దానిని బహిరంగపరచడంలోని విజ్ఞత ఎంత?). దీనికి పూర్తిగా భిన్నంగా, పోలీస్ అత్యాచారాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ఆదివాసీ ప్రజా ఉద్యమ నాయకుడు ఛత్రధర్ మహతో, 'మాకు మావోయిస్టులతో ఏ సంబంధం లేదు. వారి ఆలోచనలు వేరు, మావి వేరు' అంటున్నాడు. ఇది ఆత్మరక్షణలో చేసిన ప్రకటనే అనుకున్నా అతనిని తప్పుపట్టలేము. అయితే ఇదే వ్యాఖ్య వేరే కారణంగా చేస్తున్న మేధావులూ చాలా మంది ఉన్నారు. లాల్‌గఢ్‌లో ఆదివాసులు స్వయంపాలన నెలకొల్పి తమ బాగోగులు తాము నిర్ణయించుకుంటున్నారని ఈ వ్యాఖ్య అంటుంది. అందులో భాగంగా, పొరుగున ఉన్న సల్బోనిలో ఆదివాసులకు ఇస్తామని హామీ యిచ్చిన 4500 ఎకరాల ప్రభుత్వ భూమిని జిందాల్ వారి స్టీల్ ఫ్యాక్టరీకి రాష్ట్ర ప్రభుత్వం కట్టబెట్టగా దానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారనీ, ఈ స్వయం పాలన ఆకాంక్షను మావోయిస్టులు కబ్జా చేసుకొని లాల్‌గఢ్‌ను విముక్త ప్రాంతంగా చూపించి ప్రజాఉద్యమ స్థానంలో సాయుధ దళాల గెరిల్లా పోరాటాన్ని ప్రవేశపెట్టారని ఈ వ్యాఖ్య అంటుంది. మావోయిస్టులను తీవ్రంగా ఖండిస్తూ, ఆదివాసీ స్వయం పాలనా పోరాటాన్ని ప్రశంసిస్తుంది. ఇది నిజమయితే ఈ మాటలు అనడానికి సందేహించనవసరం లేదుగానీ ఇందులో నిజాన్ని బయటపెట్టాలన్న ఆరాటం కంటే మావోయిస్టుల ఉనికికి, వారి రాజకీయాలకు చోటు నిరాకరించాలన్న ఆరాటమే ఎక్కువ.

అది అవాస్తవికమైన, అహేతుకమైన వైఖరి. భారత ప్రజాస్వామ్యం వేరే లక్ష్యాల సంగతి అటుంచి, భారత రాజ్యాంగ ఆదర్శాలను సహితం ఒనగూర్చుతుందన్న కచ్చితమైన భరోసా ఇచ్చే స్థితిలో ఎవ్వరూ లేనప్పుడు, రాజ్యాంగం నిర్దేశించిన రాజకీయ వ్యవస్థకు వెలుపల ప్రత్యామ్నాయాలను అన్వేషించే ప్రయత్నాలను అసలే కూడదనడం అవాస్తవికమైన వైఖరి.

అయితే ఈ గుర్తింపుతోపాటు మావోయిస్టులు జవాబుదారీతనాన్ని కూడ స్వీకరించవలసి ఉంటుంది. లాల్‌గఢ్ ఆదివాసీ పోరాటంతో వారికి సంబంధాలు తొలి నుంచి ఉన్నాయన్నది స్పష్టమే. అందులో వారి పాత్ర ఉన్న విషయమూ స్పష్టమే. అయితే 4500 ఎకరాల కోసం ఆదివాసీ ప్రజలు ఉమ్మడిగా ఆందోళన చేస్తున్న నేపథ్యంలో బుద్ధదేవ్ భట్టాచార్యపైన హత్యాప్రయత్నానికి పాల్పడడం ఏ పాటి విజ్ఞత గల చర్య? దానితో మొదలయిన ఘటనలే కదా ఒకదానితో ఒకటి జత అయి ప్రస్తుత పరిస్థితికి దారితీశాయి? లాల్‌గఢ్‌లో దిగిన కేంద్ర పారా మిలిటరీ బలగాలు ఆదివాసీ ప్రజల పోరాట ఫలాలను చిదిమేసి పూర్వస్థితికి తీసుకొస్తే దానికి బాధ్యులెవరు? ఒక రకంగా ఈ చర్య పొరుగున ఒరిస్సా రాష్ట్రంలోని కంధమాల్ జిల్లాలో లక్ష్మణానంద సరస్వతి హత్యతో పోల్చదగది. స్థానిక పరిస్థితులు చాలా భిన్నమైనవి కాబట్టి పర్యవసానాలు ఒకేరకంగా లేవుగానీ, రెండూ అనాలోచితమైన చర్యలే. అక్కడ ప్రతిచర్య వల్ల క్రైస్తవులు ప్రత్యక్షంగా భారీ మూల్యం చెల్లించగా, ఇక్కడ ప్రతిచర్య వల్ల ఆదివాసులు వేరే రూపంలో చాలా మూల్యం చెల్లించబోతారు. ఈ మాటలు అంటే 'తప్పంతా మావోయిస్టుల పైనే పెడుతున్నారు' అన్న ఎదురుదాడి తప్ప వేరే జవాబు రాదు. ఎవరి మీద ఎంత తప్పు పెట్టాలో అంత పెట్టే విజ్ఞత సమాజంలో లేకపోలేదని మావోయిస్టులు గుర్తించే రోజు వస్తే వారి నాయకత్వాన్ని అనుసరిస్తున్న ప్రజలకు వారు మేలు చేసిన వారవుతారు. లేకపోతే కన్నీటి గాథలు మళ్లీ మళ్లీ పునరావృతమవుతూనే ఉంటాయి.

ఆదివాసీ ప్రజలు ఉమ్మడిగా ఆందోళన చేస్తున్న నేపథ్యంలో బుద్ధదేవ్ భట్టాచార్య పైన హత్యా ప్రయత్నానికి పాల్పడడం ఏ పాటి విజ్ఞత గల చర్య? దానితో మొదలయిన ఘటనలే కదా ఒకదానితో ఒకటి జత అయి ప్రస్తుత పరిస్థితికి దారితీశాయి? ఎవరి మీద ఎంత తప్పు పెట్టాలో అంత పెట్టే విజ్ఞత సమాజంలో లేకపోలేదని మావోయిస్టులు గుర్తించే రోజు వస్తే తమ నాయకత్వాన్ని అనుసరిస్తున్న ప్రజలకు వారు మేలుచేసిన వారవుతారు. లేకపోతే కన్నీటి గాథలు మళ్లీ మళ్లీ పునరావృతమవుతూనే ఉంటాయి.